క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని టౌన్ 2 ఏఈ ఆదిత్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. న్యూటౌన్, స్టేడియం, హోల్మీసూపర్ మార్కెట్, రవి చిల్డ్రన్స్ ఆస్పత్రి, నోబుల్ ఆస్పత్రి ప్రాంతాల్లో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల దాక, తెలంగాణ చౌరస్తా, న్యూటౌన్, ఎర్ర సత్యంచౌరస్తా, పోలీస్‌లైన్, కోర్టు ప్రాంతం, బోయపల్లిగేట్, క్రిష్టియన్‌కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, కొత్తబస్టాండ్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు, తిరిగి 10 గంటల నుంచి 11 గంటల దాక విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ న్యూటౌన్(హన్వాడ): హన్వాడ మండల గిరిజన ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం ఎంఈఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా కే గోపాల్, ఉపాధ్యక్షులుగా ఆర్ జ్యోతి, జే కృష్ణానాయక్, ప్రధానకార్యదర్శిగా ఎం.రామునాయక్, కోశాధికారిగా రవినాయక్, గౌరవాధ్యక్షుడిగా తహసీల్దార్ కృష్ణానాయక్, ముఖ్య సలహదారుగా కిష్ట్యనాయక్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో హన్మంతునాయక్, గణేశ్‌నాయక్, భద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

చలి నుంచి నారుమళ్లు సంరక్షించుకోవాలి

రాజాపూర్: రైతులు ప్రస్తుతం చలి నుంచి నారుమళ్లు సంరక్షించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నరేందర్ పేర్కొన్నారు. బుధవారం తిరుమలాపూర్, కుత్నేపల్లి గ్రామాల్లో నారుమళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మళ్లపై ఇనుపచువ్వలు, వెదురుకర్రలతో ఊతం ఇచ్చి పైన పలుచని పాలిథీన్ షీట్ లేదా, యూరియా బస్తాలతో తయారు చేసిన పట్టాలతో సాయంత్రం వేళల్లో కప్పి ఉంచి మరుసటి రోజు ఉదయాన్నే తీసివేయాలన్నారు. అదేవిధంగా పలు సస్యరక్షణ సూచనలు చేశారు. రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముఖద్వారం ప్రారంభం

నవాబుపేట: కొల్లూర్‌లో ఉన్న చింతలపురి చిన్నయ్యస్వామి మఠం ముఖద్వారాన్ని గ్రామస్తులు బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ సౌజన్య, రాఘవేందర్, ఉప సర్పంచ్ నర్సింహచారీ, మఠం పీఠాధిపతి నందీశ్వరగురుస్వామి, ఎంపీటీసీ తులసీరాంనాయక్, చందర్‌నాయక్, సేవ్యానాయక్, రఘు, బాల్‌రెడ్డి, రాజు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

12న ఉచిత శిబిరం

దేవరకద్ర: గోపన్‌పల్లిలో ఈ నెల 12న ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రక్తదానం..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈనెల 12న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ సేవా సమితి ఇన్‌చార్జ్ రాజమల్లేష్ ప్రకటనలో తెలిపారు. పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరుకావాలని తెలిపారు.

ముగ్గుల పోటీలు..

స్టేషన్ మహబూబ్‌నగర్: సంక్రాంతిని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ మహిళా విభాగమైన మాతృమండలి దుర్గావాహిని ఆధ్వర్యంలో 12న ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రాంత సహప్రముఖ్ సింధూజ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని శివశక్తినగర్ ప్రజ్ఞ స్కూల్‌లో పోటీలు ఉంటాయన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- అవినీతికి పాల్పడితే ఏ పార్టీ వారైనా చర్యలు తప్పవు
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని.. అందులో భాగంగానే సమస్యలు తెలుసుకునేందుకు ప్రజాదర్బార్, ప్రజలతో ముఖాముఖీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కుచ్చర్‌కల్‌లో ముఖాముఖీలో పాల్గొన్నారు. సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. అండర్ డ్రెయినేజీ, ప్రాథమికోన్నత పాఠశాల భవనం పనులు తదితరాలను స్థానికులు ఆయనకు వివరించారు. కాగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి శివారుల్లో ఉన్న పరిశ్రమలను సంప్రదించి వారు ఖర్చు చేసే సీఎస్ఆర్ ఫండ్‌ను ఉపయోగించే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. తన సొంతఖర్చులతో విద్యార్థులకు షూ ఇప్పిస్తానని తెలిపారు. అవినీతి అక్రమాలకు పాల్పడితే ఏ పార్టీవారైనా చర్యలు తప్పవని అన్నారు. బాలానగర్‌లో 27 ఎకరాలు రికార్డులో దిద్దారని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వివరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పాఠశాలలో వసతులకు కల్పనకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలన్నారు. తాగునీటి కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరగా వెంటనే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. నరహరి, చంద్రకాంత్‌గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, కృష్ణయ్య, రమేష్ పాల్గొన్నారు.

క్విజ్‌తో విద్యార్థుల్లో పోటీతత్వం



క్విజ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యాధికారులు తదితరులు

జడ్చర్ల టౌన్: క్విజ్ నిర్వహణ వల్ల విద్యార్థులలో పోటీతత్వం పెరిగి వారిలో దాగి ఉన్న సృజనాత్మకత, ఆలోచన ధోరణి వెలుగులోకి వస్తాయని జిల్లా విద్యాధికారి రవీందర్ అన్నారు. బుధవారం కోడ్గల్ జెడ్పీహైస్కూల్‌లో బిగ్‌హెల్ప్ సంస్థ నిర్వహించిన నియోజకవర్గ జెడ్పీహైస్కూళ్ల క్విజ్ పోటీలను ఆయన సందర్శించి ప్రసంగించారు. క్విజ్ వల్ల విద్యార్థుల్లో తెలివితేటలు బయటపడ్తాయని, కొత్త విషయాలు నేర్చుకోవాలన్న ఆకాంక్ష పెరుగుతుందన్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న క్విజ్ స్ఫూర్తిగా సంక్రాంతి సెలవుల అనంతరం జిల్లావ్యాప్తంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోటీల్లో 28 స్కూళ్ల విద్యార్థులు పాల్గొనగా బాదేపల్లి, కోడ్గల్, ఊర్కొండపేట విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాసులు, హెచ్ఎం శ్రీనివాసులు, సర్పంచ్ మమత, ప్రాజెక్ట్ అధికారి పురుషోత్తం పాల్గొన్నారు.

మంచి ఫలితాలు తీసుకురావాలి

పదో తరగతిలో మంచి ఫలితాలు తీసుకురావాలని డీఈఓ రవీందర్ సూచించారు. పెద్ద ఆదిరాల జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వేకువజామునే లేచి చదవటం వల్ల బాగా గుర్తుంచుకుని పరీక్షల్లో మంచిగా రాయగలుగుతారన్నారు. ప్రతిరోజు సబ్జెక్టుల వారీగా స్లిప్‌టెస్టులు పెట్టి లోగ్రేడ్ ఉన్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సిలబస్ పూర్తి చేయని ఉపాధ్యాయులు సంక్రాంతి సెలవుల్లోనూ తరగతులు నిర్వహించేలా చూసుకోవాలన్నారు. హెచ్ఎం మల్లయ్య ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వరూప

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఎంపీపీ గూపని కళావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్, ఎంపీడీఓ స్వరూప, తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డిలు హాజరయ్యారు. గత ప్రభుత్వ హయాంలో డీడీలు కట్టిన వారికి గొర్రెలను ఎప్పుడిస్తారని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని పశువైద్యాధికారి మధుసూదన్ తెలిపారు. మహ్మదుస్సేన్‌పల్లి, నిజాలాపూర్ బీటీరోడ్డు నిర్మాణానికి ఎన్నికల ముందు శంకుస్థాపన చేసినా నేటికీ ప్రారంభించలేదని ఎంపీటీసీ గోవర్ధన్ ప్రశ్నించగా త్వరలోనే మొదలు పెట్టే విధంగా చూస్తామని పంచాయతీరాజ్ ఏఈ లక్ష్మణ్‌గౌడ్ తెలిపారు. నందిపేటలో తాగునీటి ఎద్దడిపై సర్పంచ్ శేఖర్ సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్ ఆరోపించారు. రూ.2లక్షల రుణమాఫీ అమలు, కరెంటు బిల్లులు వంటివి వెంటనే ప్రారంభించాలని కోరారు. కాగా సభకు నలుగురు సర్పంచులు మాత్రమే హాజరయ్యారు. ఎంపీటీసీలు, ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ సరోజ, ఏపీఓ పులేందర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ ఖాదర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మతసామరస్యానికి ప్రతీకగా అబ్దుల్ ఖాదర్ దర్గా నిలుస్తున్నదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అబ్దుల్‌ఖాదర్‌షా దర్గా ఉత్సవాలను పురస్కరించుకొని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అబ్దుల్ ఖాదర్ దర్గాకు 85 ఏళ్ల చరిత్ర ఉందని, భక్తులకు కొంగుబంగారంగా, కోరిన కోరికలు తీరుతాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా కాకుండా ఉమ్మడి ఏపీ, కర్నాటక రాష్ట్రంలోని భక్తులు ఈ దర్గాను దర్శించుకొని భక్తితో తరిస్తున్నారని తెలిపారు. వంశీచందర్‌రెడ్డి మాట్లాడుతూ దర్గాలో చాదర్లు సమర్పించి జిల్లా, రాష్ట్రం, దేశం కోసం ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. దేశాన్ని కులాలు, మతాల పేరుతో విడగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ శక్తులకు వ్యతిరేకంగా మనమందరం కలిసికట్టుగా ముందుకు పోదామని అన్నారు. దర్గా ముతవల్లీ అబ్దుల్ జమీర్ ఖాద్రీ, నాయకులు వినోద్‌కుమార్, జహీర్ అఖ్తర్, చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, బెక్కరి అనిత, శేఖర్ నాయక్, లింగంనాయక్, లక్ష్మణ్ యాదవ్, అజ్మత్‌అలీ, బండ సునీల్, జహీర్, తాహెర్, అబుబకర్, నరేందర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం (టీజీపెటా) నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఉండడం వల్ల పీఈటీల ఉన్నతీకరణ చేపట్టి పదోన్నతులు కల్పించాలని కోరారు. ప్రతి పాఠశాలకు రూ.50వేల క్రీడానిధి ఏర్పాటు చేయాలని, క్రీడల్లో వస్తున్న నూతన మార్పులపై అనుగుణంగా క్రీడా నియమ, నిబంధనలపై ఓరియంటేషన్ తరగతులు నిర్వహించాలని, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు రూ.10వేల నగదు బహుమతితోపాటు విద్యార్హత మేరకు సూపర్‌న్యూమరరీ పోస్టులు సృష్టించి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్, విలియం, కృష్ణయ్య, మొగులాల్, మొయిన్, రవికుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్స్ అసోసియేషన్, మున్నూరు కాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగ సంఘం క్యాలెండర్లను వేర్వేరుగా ఆవిష్కరించారు.

చైర్మన్‌గా రంజిత్‌కుమార్

చిన్నచింతకుంట: జాతీయ మానవహక్కులు, సామాజిక న్యాయ సంఘం జిల్లా చైర్మన్‌గా నెల్లికొండికి చెందిన రంజిత్ కుమార్ నియమితులయ్యారు. బుధవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్వేందర్, వైస్ ప్రెసిడెంట్ రాజుకుమార్ ఆయనకు నియామక పత్రం అందజేశారు.

ఆకట్టుకున్న రంగవల్లులు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని కేజీబీవీలో బుధవారం విద్యార్థినులు వేసిన రంగురంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. సంక్రాంతి నేపథ్యంలో పాఠశాలలో బోగిమంటలు వేసి పండుగను ముందుగానే నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ ఇసుక క్వారీలు ధ్వంసం



మహమ్మదాబాద్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక తయారు చేస్తే చర్యలు తప్పవని మహమ్మదాబాద్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యాదయ్య హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంతోపాటు వెంకట్‌రెడ్డి పల్లి, అన్నారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఇసుక తయారీ కేంద్రాలను పరిశీలించారు. అక్రమంగా కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న క్వారీలను జేసీబీతో ధ్వంసం చేయించారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

కోయిల్‌కొండ: మండలంలో ఓటరు నమోదులో తప్పులు లేకుండా సవరణ చేయాలని పేట అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని రైతువేదికలో బీఎల్‌ఓల శిక్షణలో పాల్గొని మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా సవరణలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీఓ రామచందర్, తహసీల్దార్ భరత్‌గౌడ్ ఇతర అధికారులు ఉన్నారు.

ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్‌ను హెచ్‌డబ్ల్యూఓల సంఘం నాయకులు బుధవారం హైదరబాద్‌లో కలిశారు. నూతన సంవత్సర, సంక్రాతి శుభాకాంక్షలు తెలిపారు. రఘురాంరెడ్డి, అమిత్, తిరుపతి, గోపాల్, సదానందం, గోపాల్‌రెడ్డి, మాధురి, వేరోనికా, రెటికా, శ్రీవేణి, యశోధ, ప్రతిమ పాల్గొన్నారు.

ఈ కేవైసీ పూర్తి చేయాలి

చిన్నచింతకుంట: రేషన్ లబ్ధిదారుల ఈ కేవైసీని త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ సి. కృష్ణయ్య డీలర్లకు సూచించారు. బుధవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. రేషన్ లబ్ధిదారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, రేషన్ ఈకేవైసీని చేసుకోవాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ సుదర్శన్ రెడ్డి, ఆర్ఐ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు అవసరం



వివిధ జంతువుల వేషాధారణలో విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మౌంట్‌బాసిల్ స్కూల్‌లో బుధవారం కరాడీ పాత్ నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం ప్రదర్శించారు. కథలు, పాటలు, నాటికల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యాజమాన్యం చంద్రకళ వెంకటయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్లభాషలో పట్టు సాధించేందుకు కార్యక్రమం ఎంతో కీలకమని, అన్ని దశల్లో ఆంగ్లం అవసరం అన్నారు. డైరెక్టర్లు కృష్ణ, సుకాంత్, కరస్పాండెంట్ పూజిత, మోహన్‌రెడ్డి, శిరీష ప్రవీణ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



బాలానగర్: నూతనంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలను మార్చాలని మండలంలోని లారీ డ్రైవర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ నిఖిత రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పెద్దరేవల్లి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పదుల సంఖ్యలోని లారీలను నిలుపుదల చేశారు. డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు మంజ్యా, డ్రైవర్లు చంద్రశేఖర్, ఉమర్, లచ్చిరాం, కృష్ణ, వినోద్, సేవ్య, బాలు, శ్రీశైలం, బీమ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే పాఠశాలల అభివృద్ధి

భూత్పూర్ : బీఆర్ఎస్ పార్టీ హయాంలోనే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి జరిగిందని.. విద్యార్థుల సంఖ్య పెరిగిందని ఎంపీపీ కదిరె శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం లంబడికుంట పాఠశాల వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 20 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలకు అర్హత సాధించడంపై ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. సర్పంచ్ కమలమ్మ, ఎంపీటీసీ రమణి, మద్దిగట్ల సర్పంచ్ ప్రియాంక, ఏఎంఏ శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్ఎం లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ పథకాలు

బాలానగర్: కేంద్రం చేపడుతున్న సంక్షేమ ఫలాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు పథకాలను ప్రజలకు చేరువ చేయడమే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర లక్ష్యమని బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మి అన్నారు. మంగళవారం జేడిగుట్ట తండాలో కార్యక్రమంలో మాట్లాడారు. ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందేలా కార్యక్రమ నిర్వహణ సాగుతోందన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంజన్నకు పూజలు

దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయస్వామికి బుధవారం ఘనంగా పూజలు జరిగాయి. ఉత్సవాలలో భాగంగా భక్తులు నిత్యం పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకుంటున్నారు. దేవరకద్ర ఎంపీడీఓ శ్రీనివాసులు స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు సన్మానించి ప్రసాదాలు అందజేశారు.

పేదలకు అండగా ప్రభుత్వం

మిడ్జిల్: పేదలకు అండగా మోదీ ప్రభుత్వం నిలుస్తోందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. బుధవారం మల్లాపూర్‌లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఉద్దేశాలను ప్రజలకు వివరించారు. సర్పంచ్ జంగారెడ్డి, ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంఈఓ మంజులాదేవి పాల్గొన్నారు.

పాలమూరు: ఇటీవల ఎంపిక అయిన బీఎస్ఎన్ఎల్ టెలికం అడ్వైజర్ కమిటీ సభ్యులు కృష్ణవర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, నిరంజనమ్మ, శ్రీనివాస్, సాహితీరెడ్డిలను బుధవారం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తన నివాసంలో వారిని ఘనంగా సన్మానించారు. ఎవరికిచ్చిన బాధ్యతలను వారు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు.

తువ్వగడ్డతండాలో నీటి ఎద్దడి



ఖాళీ బిందెలతో తువ్వగడ్డతండా గిరిజనులు

గండేడ్: పగిడ్యాల్ గ్రామపంచాయతీ తువ్వగడ్డతండాలో తాగునీటి సమస్య నెల కొంది. దాదాపు 3వందల జనాభా గల ఈ తండాలో తాగునీటి నిమిత్తం వాటర్‌ట్యాంకు నిర్మించారు. తండా సమీపంలోనే బోరు వేసి కనెక్షన్ ఇచ్చారు. దీని ఆధారంగానే నీటి సరఫరా జరిగేది. కానీ దాని చుట్టూ బోర్లు వేయడంతో నీటిమట్టం తగ్గి చుక్క నీరు రావడం లేదు. మిషన్ భగీరథ ట్యాంకు నిర్మించినా ఇప్పటి వరకు కనెక్షన్ ఇవ్వలేదు. వారంరోజులుగా నీటి ఎద్దడి నెలకొనడంతో గిరి జనులు వ్యవసాయ బోర్ల నుంచే తెచ్చుకుంటున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్య తీరడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

నాసిరకం గుడ్ల పంపిణీ

- అంగన్‌వాడీల్లో తీరుమారని వైనం
- తరుచుగా వెలుగుచూస్తున్న ఘటనలు
- బాలలు, గర్భిణులకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



గండేడ్: ఉమ్మడి గండేడ్ మండల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నాసికరం గుడ్ల పంపిణీ పరిపాటిగా మారిపోయింది. తరచూ ఘటనలు వెలుగుచూస్తున్నాయి. వాటి పంపిణీ చిన్నారులు, గర్భిణులు, బాలింతల పాలిట శాపంగా మారుతోంది. ఫలితంగా వారు తరుచుగా అనారోగ్యం పాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. తరచూ ఘటనలు జరుగుతున్నా బాధ్యులపై చర్యలు చేపట్టడంలో నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి మండల పరిధిలో మొత్తం మూడు సెక్టార్లు ఉండగా 84 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అయితే దాదాపు అన్ని కేంద్రాల్లోనూ పౌష్టికాహారం సక్రమంగా అందక పోవడంతో పాటు, పంపిణీ చేసే గుడ్లు తినడానికి పనికి రావడం లేదని ఆరోపణలు వినవస్తున్నాయి. కాగా ఆయా కేంద్రాలకు గుడ్లు నాసిరకంగా కుళ్లినవి వస్తున్నాయి. సైజు తక్కువగా ఉన్నవే కాక ఎక్కువ రోజులు స్టోరేజీలో ఉన్న వాటిని ఆయా కేంద్రాలకు పంపిణీ చేస్తున్నారు. వాటిని పిల్లలకు , బాలింతలకు , గర్భిణులకు అందజేస్తున్నారు. అందులో ఎక్కువ శాతం పాడయినవి ఉంటున్నాయి. గుడ్లు ఉడకబెట్టిన వెంటనే పైపొట్టు తీయగా కుళ్లిన వాసన దుర్గంధం వస్తోంది. పూర్తిగా తెల్లసోనా, పచ్చసోనాలు వేరవడంతో పాటు దుర్వాసన వస్తుందని ఆయా కేంద్రాల్లో లబ్ధిదారులు వాపోతున్నారు.

ఆయా చోట్ల వెలుగు చూసిన ఘటనలు

- గతంలో గండేడ్ మండలంలో రంగారెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గతంలో దాదాపు 300 గుడ్లు పాడయిపోవడంతో పారబోశారు. మిగతా కేంద్రాల్లో కూడా పాడయిన గుడ్లు ఉన్నాయని ఆయా కేంద్రాల నిర్వాహకులు సూపర్‌వైజర్లకు తెలిపారు.
- వెంకట్‌రెడ్డిపల్లి కేంద్రంలో సైతం లబ్ధిదారులకు కుళ్లిన గుడ్లు అందాయి. దీంతో ఈశ్వర్ అనే కుర్రాడు వాటిని తినడంతో వాంతులు అయ్యాయి. తల్లిదండ్రులు వెంటనే తేరుకొని బాలుడ్ని అసపత్రికి తరలించి మెరుగైన చికిత్స చేయించారు.
- ఇటీవల మహమ్మదాబాద్‌లోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలోనూ కుళ్లిన గుడ్లు వచ్చాయి ఉడకబెట్టిన తర్వాత చెతికిచ్చారు. దాన్ని పొట్టు తీసి చూడగా కుళ్లిపోయి పురుగులు కనిపించాయి. దీంతో తల్లిదండ్రులు ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా వారు వచ్చి విచారణలో పై నుండే వస్తున్నట్లు తెలిపారు. ఇకముందు రిపీట్ కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కాని పరిస్థితిలో ఏమాత్రం మార్పులేదు.
- రెండు నెలల కింద కొంరెడ్డిపల్లి కేంద్రంలో చిన్నారికి కుళ్లిపోయిన గుడ్డు ఇచ్చారు. తండ్రి వచ్చి నిలదీస్తే తాము ఏమీ చేయలేమని పైనుంచే అలా వచ్చాయని సమాధానం ఇచ్చారు. ఇంకోసారి జరగకుండా చూసుకుంటామని నచ్చజెప్పారు.
- ఇటీవల వెన్నాచేడ్‌లోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో మరోమారు కుళ్లిపోయిన గుడ్లు వచ్చాయి. ఉడకబెట్టిన గుడ్డు పిల్లలకు ఇవ్వగా వారు వలిచి చూస్తే పురుగులతో పాటు భరించలేని వాసన వచ్చింది. ఈవిషయాన్ని సూపర్‌వైజర్‌తో పాటు జిల్లా అధికారులకు సైతం తెలియజేశారు. కానీ ఎలాంటి మార్పు లేదు.
- వీటికి తోడు బాలమృతం, పాలు తదితరాలు సైతం పక్కదారి పడుతున్నాయని తెలుస్తోంది. గర్భిణులు, బాలింతలకు ఇవ్వాల్సినవి పశువుల దాణాగా మారుతున్నాయని పలువురో ఆరోపిస్తున్నారు. కొందరు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు బ్లాక్ మార్కెట్లో అక్రమంగా విక్రయిస్తున్నారని తెలియవస్తోంది. అధికారుల నిర్లక్ష్యమే ఇలాంటి ఘటనలకు కారణమవుతోందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తగిన చర్యలు తీసుకుంటాం

అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లినగుడ్లు వచ్చిన విషయం ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. ఈ మధ్యే బాధ్యతలు తీసుకున్నా. సంబంధిత అధికారులను పిలిపించి సమావేశం ఏర్పాటు చేస్తాం . కుళ్లిన గుడ్లు పంపిణీ చేస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు అందజేసి పరిస్థితి చక్కదిద్దేలా చూస్తాం. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– జ్యోతి, డీడబ్ల్యూఓ, మహబూబ్‌నగర్

శబరిమలకు తరలిన మాలాధారులు





గండేడ్/మహమ్మదాబాద్/హన్వాడ: మహమ్మదాబాద్ మండలకేంద్రంలోని కాంతిమల కొండ అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. మాలాధారులు శబరిమలై యాత్రకు బయలుదేరడంతో ఇరుముడి మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస్, రాజు గురుస్వామి ఆధ్వర్యంలో గండేడ్, మహమ్మదాబాద్, హన్వాడ, కోయిల్‌కొండ తదితర మండలాలకు చెందిన భక్తులు ఇరుముడులు కట్టుకున్నారు. గురుస్వాములు లక్ష్మీకాంత్‌రెడ్డి, బాల్‌రాజు, గోపాల్, శ్రీనువాస్, గోవర్ధన్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: అయ్యప్పమాలధారుల ఇరుముడి కార్యక్రమం బుధవారం మండల కేంద్రంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. సాంబశివ గురుస్వామి, నరేష్‌స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అనంతరం అన్నదానం చేశారు. సత్యం, బాల్‌రెడ్డి, అశోక్, విజయ్, అనిల్, సాయిరాం, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.